ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7

తమిళనాడు
TAMILNADU
ఆదివారం 2 ఫిబ్రవరి 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017



బడ్జెట్లో మళ్లీ తమిళనాడు పేరే లేదు : సీఎం స్టాలిన్

రాష్ట్రానికి సంబంధించినంత వరకు కేంద్ర బడ్జెట్ ఒక బూటకం. బడ్జెట్లో తమిళనాడు పేరు లేకపోవడం దారుణం. ఎన్నో వినతులు చేసినా, ఒక్కటి కూడా ఈ బడ్జెట్‌లో చేర్చలేదు. రహదారులు, రైల్వే పథకాలు, కోవై, మదురైలలో మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు ఎందుకు నిధులు ఇవ్వలేదు? ఆర్థిక నివేదిక, ఉన్నత విద్యా సంస్థల ర్యాంకింగ్ నివేదిక, నీతి ఆయోగ్ నివేదిక, చివరకు కేంద్ర ప్రభుత్వ నివేదికలో కూడా తమిళనాడు అగ్రస్థానంలో ఉంది. అలాగే, తమిళనాడును ప్రశంసిస్తూ పేజీలకు పేజీలు చదివారు. అయితే ఎందుకు పూర్తిగా విస్మరించారు? తమిళనాడు అంగీకరించని విధానాలు, మాతృభాషపై చూపుతున్న ఆసక్తి తదితరాల కారణాలతో నిధుల కేటాయింపులో పక్షపాతం చూపుతారా? కేంద్రప్రభుత్వం తన పథకాల్లో వాటా తగ్గించుకుంటూ పోవడంతో రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరుగుతూనే ఉంది. పలు పథకాలకు అందించే సబ్సిడీ తగ్గిస్తున్న కేంద్రం.. వాటిల్లో కూడా పలు నిబంధనలు తమిళనాడుకు మాత్రమే విధిస్తోంది. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయో, ఎక్కడ బీజేపీ కూటమి ప్రభుత్వం ఉంటుందో, ఆయా రాష్ట్రాలకు మాత్రమే పథకాలు, నిధులు ప్రకటిస్తున్నందున దీనిని కేంద్ర బడ్జెట్ అని ప్రకటించాల్సిన అవసరం ఏముంది?

ఈ బడ్జెట్ వల్ల రాష్ట్రానికి ఒరిగేదేమీలేదు : అన్నాడీఎంకే చీఫ్ ఈపీఎస్

పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి చూపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు, యువకులు, మహిళలు, రైతులకు సహాయకంగా ఈ కేంద్రబడ్జెట్ పథకాలు ఉంటాయని ప్రజలంతా ఎదురుచూశారు. కానీ అలాంటి ప్రత్యేక పథకాలు ఏమీ తీసుకురాలేదు. నిర్మలమ్మ బడ్జెట్‌లో ఆదాయ పన్ను మినహాయింపును పెంచడం ఆహ్వానించదగ్గ అంశం. అదేవిధంగా స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించేలా పన్నులో మార్పులు తీసుకురావడం మంచిదే. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌కు మాత్రం పలు అభివృద్ధి పథకాలను ఈ బడ్జెట్‌లో ప్రకటించారు. నీటికొరత అధికంగా వుండే తమిళనాడులో వ్యవసాయ సంపదను పెంచుకునేందుకు, సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని అడ్డుకునేందుకు అనుకూలంగా నదీ జలాల అనుసంధానం గురించి ఎలాంటి ప్రకటనా ఈబడ్జెట్‌లో లేదు. ఏడాది నుండి రాష్ట్రప్రజలు ఎంతోఆసక్తిగా ఎదుచూస్తున్న రైల్వే పథకాలు, కోవై, మదురై నగరాలకు మెట్రోరైలు పథకాలు ప్రకటించకపోవడం నిరాశకు గురిచేసింది.

ఇదేంటి నిర్మలమ్మా?!

పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెడుతున్న నిర్మలా సీతారామన్

రాష్ట్రానికి ఉత్తచేతులా?

- ఈ బడ్జెట్‌తో ఒరిగిందేముంది?
- ఉద్దేశపూర్వకంగానే తమిళనాడు విస్మరణ
- బీజేపీ, పీఎంకే మినహా మిగిలిన అన్ని పార్టీల ధ్వజం
- ఆదాయపు పన్ను మినహాయింపును స్వాగతించిన ఈపీఎస్, విజయ్

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ శనివారం దాఖలు చేసిన బడ్జెట్‌లో తమిళనాడుకు అన్యాయం జరిగిందంటూ రాష్ట్రంలోని పలు పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బీజేపీ, పీఎంకే, టీఎంసీ మినహా మిగిలిన పార్టీలన్నీ రాష్ట్రానికి నిధులు ఇవ్వకపోవడంపై ధ్వజమెత్తాయి. బడ్జెట్లో తమిళనాడు పేరే లేదని సీఎం స్టాలిన్ మండిపడగా, ఈ బడ్జెట్ వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిస్వామి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ప్రజలను మోసం చేసే బడ్జెట్ అని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వ పెరుందగై వ్యాఖ్యానించగా, వామపక్షాలు సైతం అదేబాట పట్టాయి. అయితే పన్ను తగ్గింపు, వృద్ధి ఆవశ్యకత సమతూకం చేసేలా కేంద్ర బడ్జెట్ ఉందని బీజేపీ, దాని మిత్రపక్షాలు వ్యాఖ్యానించాయి. పళనిస్వామితో పాటు టీవీకే అధినేత విజయ్ మాత్రం పన్ను మినహాయింపును స్వాగతిస్తూనే, రాష్ట్రానికి తగినన్ని నిధులు ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మలమ్మ బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే..?

ప్రజలను మోసం చేసే బడ్జెట్ : టీఎన్‌సీసీ చీఫ్ సెల్వ పెరుందగై

నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను మోసం చేసింది. దేశంలో మొత్తం 144 కోట్ల మంది జనాభా ఉండగా, 15 శాతం మంది అంటే 20 కోట్ల మంది పేదరికంలో మగ్గుతున్నారు. అయితే, విత్తమంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేసినట్లు చెప్పడం హాస్యాస్పదం. ఈ బడ్జెట్‌ను నిశితంగా పరికిస్తే ఇది ఒక ఎండమావి బడ్జెట్. బీజేపీ యేతర రాష్ట్రాలకు నిధులు కేటాయించకుండా కేవలం విభజన రాజకీయాలు చేస్తున్న మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎదలను ఏమార్చేది.

బడ్జెట్లో అత్యంత మోసపోయిన రాష్ట్రం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం

తమిళనాడును పూర్తిగా విస్మరించారు. ముఖ్యంగా ఈ బడ్జెట్లో తుఫాను, వరద విపత్తుల సహాయానికి ఎలాంటి నిధులు కేటాయించలేదు. ఈ బడ్జెట్లో అత్యంత మోసపోయిన రాష్ట్రం తమిళనాడు. అదే సమయంలో తమ పాలనకు మద్దతిస్తున్న పార్టీలను తృప్తిపరిచేందుకు, అసెంబ్లీ ఎన్నికలను పరిగణనలోకి తీసుకుని బిహార్, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు అదనపు ప్రకటనలు చేశారు. ఈ బడ్జెట్లో తమిళనాడుకు రైల్వే అభివృద్ధి ప్రాజెక్టులు, హైవేలు, మదురై, కోయంబత్తూరు మెట్రోప్రాజెక్టు వంటి ప్రకటనలే లేవు. తమిళనాడు ముమ్మాటికీ నిర్లక్ష్యానికి గురైంది.

రాష్ట్రాన్ని మళ్లీ విస్మరించారు

● టీవీకే అధ్యక్షుడు విజయ్

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాన్ని మరోమారు విస్మరించారు. కేంద్ర బడ్జెట్‌లో కొన్ని అంశాలు ఆహ్వానించేలా ఉన్నాయి. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ప్రకటన స్వాగతిస్తున్నాం. అదే సమయంలో పెట్రోల్, డీజిల్‌పై పన్ను, జీఎస్టీ తగ్గింపు తదితరాలపై ఎలాంటి ప్రకటన లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తొలుత 5 లక్షల మందికి రూ.2 కోట్ల వరకు రుణాలు అందించే ప్రకటన ఆహ్వానించదగ్గదే. అదే సమయంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ, ఉపాధి అవకాశాలు పెంచడం తదితరాలపై బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన లేకపోవడం దారుణం. తమిళనాడులో కొత్త రైల్వే పథకాలు, రోడ్లు, కోయంబత్తూర్, మదురైలలో మెట్రో రైళ్ల ప్రాజెక్ట్ తదితర రాష్ట్రానికి అవసరమైన వసతుల కల్పనపై ఎలాంటి ప్రకటన లేకపోవడం ఆవేదనకు గురిచేస్తోంది. యధావిధిగా ఈ ఏడాది కూడా కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు కొత్త పథకాలు, తగిన నిధులు అందించకుండా విస్మరించింది. అన్ని రాష్ట్రాల అభివృద్ధి ప్రాతిపదికగా కేంద్ర బడ్జెట్ దాఖలుచేయాలి. అందుకు విరుద్ధంగా పక్షపాత వైఖరి అవలంబించడం సరికాదు.

రైతులను మరిచిపోయారు

సీపీఐ, తమిళనాడు రైతుసంఘం

ఈ బడ్జెట్లో రైతులను పూర్తి విస్మరించారు. ఎప్పటిలానే కేంద్ర ఆర్థికమంత్రి రైతులను మోసం చేసినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ మాసిలామణి, తమిళనాడు రైతుసంఘం అధ్యక్షుడు ఎస్.గుణశేఖరన్ విమర్శించారు. సీజనల్ ప్రమాదాలు ఏడాదికాలంగా కొనసాగుతున్నా రైతుల డిమాండ్ మేరకు విపత్తు నిధిని పెంచే ప్రకటన లేదన్నారు. ఇప్పటి వరకూ 64 శాతం వున్న విదేశీ మూలధనాన్ని 100 శాతం పెంచి, దోపిడీకి వినియోగిస్తున్నారన్నారు. సీజనల్ విపత్తుల కారణంగా దేశంలోని అనేక జిల్లాలు దెబ్బతింటాయని పర్యావరణ నిపుణులు హెచ్చరించినా పట్టించుకోని ధోరణి వల్ల వ్యవసాయోత్పత్తి దెబ్బ తింటుందన్నారు. తమిళనాడుకు ఉద్దేశపూర్వకంగా నిధుల సంగతి విస్మరించినట్లున్నారని వాపోయారు.

పన్ను రాయితీ పెంపు ఆహ్వానించదగ్గది

పీఎంకే అధినేత రాందాస్

దేశంలో వార్షికాదాయం రూ.12 లక్షలు పొందేవారు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని కేంద్ర ఆర్థిక నివేదికలో ప్రకటించడాన్ని ఆహ్వానిస్తున్నాం. దీనివల్ల మధ్యతరగతి ప్రజల పన్ను భారం బాగా తగ్గుతుంది. రానున్న ఐదేళ్లలో వైద్య కోర్సుల సీట్లు అదనంగా 75 వేలు పెంచడం, వచ్చే ఆర్థిక సంవత్సరంలో వైద్య కోర్సుల్లో అదనంగా 10 వేల సీట్లు పెంపు, 36 రకాల మందులకు కస్టమ్స్ సుంకం రద్దు, అన్ని రాష్ట్రాల్లో క్యాన్సర్ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు తదితర ప్రకటనలు కూడా ఆహ్వానించేవే. అదే సమయంలో పాఠశాల విద్యకు రూ.78572.10 కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదు. అలాగే, రైలు ప్రాజెక్ట్‌లు, సాగునీటి ప్రాజెక్ట్‌లకు సంబంధించి ఎలాంటి ప్రకటన లేకపోవడం నిరాశ కలిగిస్తోంది.



సచివాలయంలో కలెక్టర్లతో మాట్లాడుతున్న సీఎం

ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధులు మీరే

● కొత్త కలెక్టర్లతో సీఎం స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధులు మీరేనని, ఆ విషయాన్ని గుర్తు పెట్టుకుని బాధ్యతలు నిర్వర్తించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ వివిధ జిల్లాలకు కొత్తగా నియమితులైన కలెకర్లకు సూచించారు. సచివాలయంలో శనివారం సీఎంతో కొత్తగా నియమితులైన జిల్లా కలెక్టర్లు ఆర్.సతీష్ (ధర్మపురి), ఎస్.ఈశ్వరన్ (దిండుగల్), ఎం.ప్రతాప్ (తిరువళ్లూర్), సి.దినేష్‌కుమార్ (కృష్ణగిరి), షేక్ అబ్దుల్ రెహ్మాన్ (విల్లుపురం), కె.దర్పకరాజ్ (తిరువణ్ణామలై), వి.మోహన్‌చంద్రన్ (తిరుపత్తూర్), డాక్టర్ ఆర్.సుకుమార్ (తిరునల్వేలి), కె.శివసౌందరవల్లి (తిరువారూరు) భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని వారికి సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలను తరచూ తనిఖీ చేయాలన్నారు. అలాగే, గ్రీవెన్స్‌లో ప్రజలు అందజేసే వినతిపత్రాలను సత్వరం పరిష్కరించాన్నారు. జిల్లాల్లో శాంతి భద్రతలపై ఎప్పటికప్పుడు ఎస్పీతో సంప్రదింపులు జరపాలన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు వారిపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిని సత్వరం అరెస్ట్ చేయించడం, శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోనే తమ తమ జిల్లాలను అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, శాంతి భద్రతలు సహా అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిచేలా చర్యలు చేపట్టాలని సీఎం కొత్త కలెక్టర్లకు సూచించారు.





జల్లికట్టులో పోట్లగిత్తల్ని నియంత్రిస్తున్న యువకులు

తంజావూరులో రంకెలేసిన పోట్లగిత్త

● కోలాహలంగా జల్లికట్టు

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా మాతాకోటలో లూర్దు మాతా జల్లికట్టు పేరవై ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జల్లికట్టు పోటీలు కోలాహలంగా సాగాయి. తంజావూరు ఎమ్మెల్యే నీలమేఘం, రెవెన్యూ తహసీల్దార్ ఇలక్కియ యువకుల చేత ప్రతిజ్ఞ చేయించి పోటీలు ప్రారంభించారు. అనంతరం వాడివాసల్ నుంచి తంజావూరు, పుదుకోట, తిరుచ్చి, మదురై, అరియలూరు, పెరంబలూరు జిల్లాలకు చెందిన 657 పోట్ల గిత్తలు ఒకదాని తర్వాత ఒకటి రంకెలేస్తూ బయటకు వచ్చాయి. ఎద్దులను అదుపు చేసేందుకు 358 మంది యువకులు బరిలో నిలిచారు. మొత్తం ఐదు రౌండ్లుగా పోటీ జరిగింది. ఎద్దులు అదుపుచేసే సమయంలో యువకులు గాయాలు కాకుండా వాడివాసల్ నుంచి సుమారు 100 మీటర్ల వరకు అరటి నారను వేశారు. ఎద్దులు అదుపుచేసిన యువకులకు సైకిళ్లు, డైనింగ్ టేబుల్, సిల్వర్ అండా సహా పలు వస్తువులు అందించారు. అలాగే, యువకులకు చిక్కకుండా వెళ్లిన ఎద్దుల యజమానులకు కూడా బహుమతులు అందజేశారు. తొలుత క్రీడాకారులకు ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి, అర్హత కలిగిన వారిని మాత్రమే పోటీలకు అనుమతించారు. అలాగే, ఎద్దులను కూడా వెటర్నరీ వైద్యులు పరీక్షించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వాటిని మాత్రమే పోటీలకు అనుమతించారు. పోటీల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 400 మంది పోలీసులు భద్రతా విధులు చేపట్టారు.



మచ్చలేని నాయకుడు ఓమందూర్ రామస్వామిరెడ్డి

● 103వ జయంతి వేడుకల్లో ఆచార్య సీఎంకే రెడ్డి



మాజీముఖ్యమంత్రి ఓమందూర్ రామస్వామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆచార్య సీఎంకేరెడ్డి, నాయకర్ నందగోపాల్ తదితరులు

ప్యారీస్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, తెలుగుతల్లి ముద్దుబిడ్డ ఓమందూర్ రామస్వామిరెడ్డి మచ్చలేని నాయకుడిగా ప్రజలకు అంకితభావంతో సేవలందించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి కొనియాడారు. ఓమందూర్ రామస్వామిరెడ్డి 103వ జయంతి వేడుకలను శనివారం స్థానిక కీల్పాక్కంలోని ఏఐటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వేదికపై ఏర్పాటు చేసిన ఓమందూర్ రామస్వామిరెడ్డి చిత్రపటానికి ఏఐటీఎఫ్ నిర్వాహకులు, యువజన విభాగం కార్యకర్తలతో కలిసి సీఎంకే రెడ్డి పూలు చల్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్రాస్ ప్రిసీడియంలో టంగుటూరి ప్రకాశం పంతులు, కుమారస్వామి రాజా, పిట్టి త్యాగరాయశ్రేష్టి, ఓమందూర్ రామస్వామిరెడ్డి తెలుగు వారికంటూ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారన్నారు. వీరిలో ఓమందూర్ మద్రాస్ ప్రిసీడియం ముఖ్యమంత్రిగా రెండేళ్ల వ్యవహరించి అద్భుతమైన పరిపాలన చతురతను ప్రదర్శించి, దేవదాసీల విధానాన్ని రద్దు చేయడంతో పాటు అణగారిన వర్గాలకు ఆలయాల్లో ప్రవేశించే హక్కును అమలుపరచారని తెలిపారు. 1948లో ఆపరేషన్ పోలో సమయంలో హైదరాబాద్ విలీనంలో ఓమందూర్ కీలకపాత్ర పోషించారని, మహిళా హక్కుల కోసం డాక్టర్ ముత్తులక్ష్మీరెడ్డితో కలిసి పోరాడి సాధించిన మహనీయుడని కీర్తించారు. కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా ఆయన ఆర్థికవ్యవస్థ మెరుగుపరచడంతో పాటు పంటలు, పశువుల బీమా పథకాలను పరిచయం చేసినట్లు తెలిపారు. వయోజన విద్య, గ్రామపరిశ్రమల అభివృద్ధి, సామూహిక ఐక్యత, కుష్ఠురోగులకు ఆరోగ్య సంరక్షణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధి వంటి ఎన్నో సంక్షేమ పథకాలతో ఘనత సాధించి చరిత్రలో నిలిచిపోయిన ఓమందూర్ రామస్వామి రెడ్డి సేవలు చిరస్మరణీయమని సీఎంకే రెడ్డి పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ప్రధాన కార్యదర్శి నాయకర్ నందగోపాల్, ఎన్.నిర్మల్ చందర్, అరక్కోణం మనోహరన్ సహా ఏఐటీఎఫ్ యువజన విభాగ కార్యకర్తలు పాల్గొని ఓమందూర్‌కు పుష్పాంజలి ఘటించారు.

సమాచార దర్శిని

'డాప్లర్ రాడార్'పై శిక్షణకు ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'డాప్లర్ రాడార్' పనితీరు, వినియోగించే విధానంపై కళాశాల విద్యార్థులకు ఐదు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వాతావరణ సమాచారం కచ్చితంగా సేకరించేందుకు 'డాప్లర్ రాడార్లు' ప్రధాన భూమిక పోషిస్తున్న విషయం విదితమే. ఈక్రమంలో గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, కమ్యూనికేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ కోర్సుల విద్యార్థులు, పరిశోధకులకు శిక్షణ ఇవ్వనున్నారు. చెన్నైలో నిర్వహించనున్న శిక్షణా శిబిరంలో నగరం సహా చుట్టుపక్కల జిల్లాలకు చెందిన 25 ఏళ్ల విద్యార్థులు పాల్గొనవచ్చు. విద్యార్థులు నేరుగా గానీ, విద్యా సంస్థల ద్వారా సిఫారసుతో ఈనెల 20వ తేదిలోగా పేర్లు నమోదు చేసుకోవాలి. శిక్షణకు ఎంపికైన విద్యార్థుల వివరాలు 21వ తేది విడుదల చేయనున్నారు. బస వసతి విద్యార్థులే చూసుకోవాలి. ఆసక్తి కలిగిన వారు dwr.chennai@imd.gov. in, dwrchennai@gmail.comలో గానీ, నెం.9444505838లో ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు సంప్రదించవచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

ఖాళీ మద్యం బాటిళ్ల సేకరణకు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): ఖాళీ మద్యం బాటిళ్ల సేకరణకు టాస్మాక్ సంస్థ టెండర్లు ఆహ్వానించింది. న్యాయస్థానం ఉత్తర్వులతో ఖాళీ మద్యం బాటిళ్లు సేకరించే పనులను గత 2022లో టాస్మాక్ ప్రారంభించింది. ఈ విధానం 9 జిల్లాల్లో పూర్తిగాను, ఏడు జిల్లాల్లో కొండ ప్రాంతాల్లో అమలులో ఉంది. దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసినప్పుడు బాటిల్ రూ.10 అదనంగా వసూలు చేస్తారు. అనంతరం ఖాళీ బాటిల్ ఇస్తే రూ.10 తిరిగి అందిస్తుంటారు. ఈ విషయమై టాస్మాక్ అధికారులు మాట్లాడుతూ... న్యాయస్థానం ఉత్తర్వులతో ఖాళీ మద్యం బాటిళ్లు తిరిగి తీసుకొనే పథకం వచ్చే ఏప్రిల్ చివరికి అన్ని జిల్లాల్లో అమలుకు రానుందని తెలిపారు.

ఐటీఐలో గ్రూప్-4కు ఉచిత శిక్షణ

పెరంబూర్,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని ఉపాధి అవకాశాలు, వృత్తి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టీఎన్‌పీఎస్సీ గ్రూప్-4 పరీక్షకు ఉచిత శిక్షణ వాషర్‌మెన్‌పేటలోని ప్రభుత్వ ఉత్తర చెన్నై ఐటీఐలో అందించనున్నారు. వారాంతపు రోజుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు గిండిలోని ఉపాధి అవకాశాలు, వృత్తి శిక్షణ సంస్థ కార్యాలయాన్ని నేరుగా సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు cgpecgc@gmail.com-అనే ఈ-మెయిల్ ద్వారా తెలుసుకోవచ్చని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

పెరంబూర్,ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.6.50 తగ్గింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుగుణంగా ఆయిల్ సంస్థలు ప్రతినెలా సిలిండర్ ధరల్లో మార్పులు చేపడుతుంటాయి. ఆ ప్రకారం, గత నెల 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.14.50తగ్గి రూ.1,966కు విక్రయం కాగా,ఈనెలలో రూ.6.50 తగ్గి రూ.1,559.50కి విక్రయమవుతోంది. అదే సమయంలో, గృహవినియోగ గ్యాస్‌సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేకుండా రూ.818.59కి విక్రయమవుతోంది. కాగా, రెండో నెల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గడం గమనార్హం.

అత్తిపట్టులో నిలిచిన విద్యుదుత్పత్తి

ప్యారీస్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా అత్తిపట్టులో తమిళనాడు విద్యుత్‌బోర్డు (టీఎన్ఈబీ) నిర్వహణలోని నార్త్ చెన్నై థర్మల్ విద్యుత్‌కేంద్రంలో బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా 600మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. అ థర్మల్ విద్యుత్‌కేంద్రం విస్తరణ పథకం కింద కొత్తగా తలా 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండువిద్యుత్‌ఉత్పత్తి ప్లాంట్లు పని చేస్తున్నాయి. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ చెన్నై, శివారు ప్రాంతాల అవసరాలను పూర్తి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెండో ప్లాంట్‌లో ఉన్న బాయిలర్ ట్యూబ్ శుక్రవారం తెల్లవారుజామున 2.20 గంటలకు లీకేజీ కావడంతో 600 మెటావాట్ల విద్యుత్ ఉత్పతికి అంతరాయం ఏర్పడింది.

20నుంచి చెంగల్పట్టులో పుస్తక ప్రదర్శన

పెరంబూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా 6వ వార్షిక పుస్తక ప్రదర్శన ఈనెల 20వ తేది నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో, చెంగల్పట్టు ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రి సమీపంలోని అలిసన్ కాశి మహోన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 20 నుంచి 28వ తేది వరకు బుక్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు జిల్లా యంత్రాంగం పేర్కొంది.

ఉప్పు కార్మికులకు రూ.16 కోట్ల సాయం

పెరంబూర్, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): ఉప్పు కార్మికులకు వర్షాకాల సాయంగా రూ.16 కోట్లు అందజేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతాజీవన్ తెలిపారు. నగరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియా మాట్లాడుతూ... దేశంలో ఉప్పు ఉత్పత్తిలో గుజరాత్ ప్రథమ స్థానం, రాజస్తాన్ రెండో స్థానం, తమిళనాడు మూడవ స్థానంలో ఉందన్నారు. రెండో స్థానికి చేరేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఉప్పు ఉత్పత్తి రంగంపై యువకులు ఆసక్తి చూపడం లేదని తెలిపారు. వర్షాకాలంలో పనులు లేని ఉప్పు కార్మికులకు తలా రూ.5 వేలు అందించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారని, ఆ ప్రకారం, 32 వేల మంది కార్మికులకు రూ.16 కోట్లు అందజేసినట్లు మంత్రి తెలిపారు.

ప్రమాదాలకు కారణమవుతున్న పొగమంచు

● రహదారిపై ప్రయాణికుల ఇక్కట్లు

తిరుత్తణి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోతత్తూరుపేటలో శనివారం తెల్లవారుజామున పొగమంచు కారణంగా హైవేపై ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కండిగై, అకూర్, మురుగంపట్టు, కాశీనాథపురం, ఆర్కాట్ కుప్పం తదితర గ్రామాల్లో ఉదయం 9గంటలవుతున్న మంచు కురవడంతో వాహనాలకు రోడ్డు కనిపించకుండా పోతోంది. తెల్లవారుజామున కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలనుంచి వేగంగా వాహనాలు వెళుతుంటాయని, చిన్నారులు, వృద్ధులు రోడ్డు దాటే క్రమంలో ఏ వాహనం కారణంగా ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కు మంటున్నారు. అధికారులు స్పందించి స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



పొగమంచులో ప్రయాణిస్తున్న వాహనాలు

పోజుల ముద్దుకృష్ణుడు కన్నుమూత



అడయార్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు వికాస సమితి అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పోజుల ముద్దుకృష్ణుడు (89) శనివారం రాత్రి కన్నుమూశారు.కొన్ని రోజులుగా వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వచ్చిన ఆయన తిరువళ్ళూరు జిల్లా గుమ్మిడి పూండి తాలూకా, మాదరపాక్కం సమీపంలోని పాదిరవేడులోని ఆయన కుమార్తె ఇంటిలో శనివారం రాత్రి 9 గంటలకు కన్నుమూశారు. స్థానికంగా సైకిల్ మాస్టర్‌గా గుర్తింపు పొంది, జాతీయ అవార్డును సైతం స్వీకరించారు. తెలుగు భాష కోసం అహర్నిశలు కృషి చేసిన ఆయన.. గ్రామీణ ప్రాంతంలో తెలుగు భాష పూర్వవైభవానికి అలుపెరగని కృషి చేశారు.ఉద్యోగ విరమణ అనంతరం మొత్తం ధనాన్ని తెలుగు భాష, తెలుగు విద్యార్థుల కోసం వ్యయం చేశారు. ముద్దుకృష్ణుడి మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు.ఆదివారం సాయంత్రం 3 గంటలకు పాదిరివేడులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ప్రాథమిక హక్కులు కాలరాసేలా హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీల జెండా స్తంభాలను తొలగించాలనే హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు, ప్రాథమిక హక్కులు హరించడమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ వ్యాఖ్యానించారు. బహిరంగ ప్రాంతాల్లోని అన్ని పార్టీలకు చెందిన జెండా స్తంభాలు తొలగించాలని ఇటీవల హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయమై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ విడుదల చేసిన ప్రకటనలో... హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలన్నారు. న్యాయస్థానం కూడా ఈ ఉత్తర్వులను పునఃపరిశీలించాలని పేర్కొన్నారు.

8చోట్ల డీన్ హోదాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ప్యారీస్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండీలోని అన్నా వర్శిటీ నిర్వహణలో పనిచేస్తున్న ఎనిమిది అనుబంధ కళాశాలల్లో ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) ఈ నిబంధనలకు విరుద్ధంగా డీన్ పదవుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారని తమిళనాడు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల ప్రొఫెసర్ల సంక్షేమ సంఘం ఆరోపించింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఉన్న 488 ఇంజనీరింగ్ కళాశాలలు అన్నా వర్శిటీ నుంచి లైసెన్సు పొంది పనిచేస్తున్నాయి. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు ఏఐసీటీఈ నిబంధనలు పాటిస్తున్నాయి. ఇవి కాకుండా అన్నా వర్శిటీ అనుబంధ కళాశాలలుగా గిండి ఇంజినీరింగ్, గిండి అలగప్ప పాలిటెక్నిక్, క్రోమ్‌పేట ఎంఐటీ, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కళాశాలలు పనిచేస్తున్నాయి. వీటితో పాటు దిండివనం, అరియలూరు, కోవై, నాగర్ కోవిల్, తూత్తుకుడి, రామనాథపురం సహా 16ప్రాంతాల్లో అన్నా వర్శిటీ అనుబంధ కళాశాలు పనిచేస్తున్నాయి. ఇదిలా ఉండగా ఏఐసీటీఈ నింబంధనలను అతిక్రమించేలా దిండివనం, అరియలూరు, బన్రూట్టి, నాగర్ కోవిల్, రామనాథపురం, తిరుక్కువలై, పట్టుకోట ల్లో ఉన్న అన్నా వర్శిటీ అనుబంధ కళాశాలలో డీన్ పదవులలో అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారని, ఈ అధికారాన్ని అన్నావర్శిటీకి ఎవరిచ్చారన్నది ఇంజనీరింగ్ కళాశాలల ప్రొఫెసర్ల సంఘం ప్రశ్నిస్తోంది.

సెప్టిక్‌ట్యాంకులో కార్మికుడు మరణిస్తే ఇంటి యజమానిదే బాధ్యత

● మద్రాస్ హైకోర్టు

ప్యారీస్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సెప్టిక్ ట్యాంకులో దిగి విషవాయువు సోకి కార్మికుడు మరణిస్తే ఆ ఇంటి యజమానే బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక వినాయకపురానికి చెందిన యోగేష్ బాబు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో, తాము నివసిస్తున్న ప్రాంతంలో డ్రైనేజీ కనెక్షన్ వసతి కల్పించాలని కోరుతూ, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌కు పలుమార్లు సమర్పించిన వినతిపత్రాలకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అందువల్ల తన ఇంట్లో ఏర్పాటు చేసుకున్న సెప్టిక్‌ట్యాంక్ మురుగునీటితో నిండిందని, ఈ నీటిని 2013 సెప్టెంబరు 30న కార్పొరేషన్ ఉద్యోగులు తొలగించే పనుల్లో పాల్గొన్నారని తెలిపారు. అప్పుడు సెప్టిక్‌ట్యాంకులో దిగిన మునుస్వామి విషవాయువు సోకి మృతి చెందారని, ఆయన కుటుంబానికి తన వంతు సాయంగా రూ.55వేలు అందజేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి నష్టపరిహారంగా రూ.10లక్షలు చెల్లించాలంటూ కార్పొరేషన్ తనకు జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని యోగేష్‌బాబు పిటిషన్‌లో కోరారు. పిటిషన్‌పై విచారణ న్యాయస్థానం సెప్టిక్‌ట్యాంకులో దిగి మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి తగిన నష్టపరిహారం చెల్లించాలని పిటిషనర్ యోగేష్‌బాబు ఉత్తర్వులు జారీచేసింది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రైవేటు బస్సు

● మంటలు చెలరేగి 11 మందికి గాయాలు

అడయార్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి తిరుచ్చికి బయలుదేరిన ప్రైవేటు బస్సు అరంతాంగి సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో బస్సులో మంటలు చెలరేగాయి. ఈ సంఘటనలో 11 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం 6గంటలకు చెన్నై నుంచి నాగర్‌కోయిల్‌కు బయలుదేరింది. ఈ బస్సులో డ్రైవర్, కండక్టరుతో సహా మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నారు. శనివారం వేకువజామున 2 గంటల ప్రాంతంలతో తిరుచ్చి జిల్లా తువరంగకుర్చి సమీపంలో తిరుచ్చి - మదురై జాతీయ రహదారిలో వెళుతుండగా, నియంత్రణ కోల్పోయిన బస్సు రోడ్డు పక్కన ఉండే విద్యుత్ స్తంభాన్ని ఢీకొనింది. ఆ తర్వాత బస్సులో మంటలు చెలరేగడంతో 11 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.



'అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక సమితి' వ్యవస్థాపక కార్యదర్శి యర్రమిల్లి రామకృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం ఆంధ్ర బాలానంద సంఘంలో సమితి సభ్యులు డాక్టర్ దిట్టకవి అనంత పద్మనాభమూర్తి, దామెర్ల పద్మావతి, గుర్రం బాలాజీ, కల్పన తదితరులు

దివ్యమైన మనసుతో ఆరాధించడమే భక్తి మార్గం

● త్రిదండి చిన్న జీయర్‌స్వామి





యాగశాలను పరిశీలిస్తున్న చిన్నజీయర్ స్వామి - అనుగ్రహ భాషణం చేస్తున్న చిన్నజీయర్ స్వామి

ప్యారీస్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దివ్యమైన మనసుతో భగవంతుడిని ఆరాధించడమే భక్తిమార్గమని శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి పేర్కొన్నారు. స్థానిక రాయపేటలో ప్రసిద్ధిచెందిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస పెరుమాళ్ ఆలయ మహాకుంభాభిషేకం వచ్చే సోమవారం నిర్వహించనున్న సందర్భంగా ఆలయప్రాంగణంలో శనివారం ఏర్పాటుచేసిన యాగశాలలో సాయంత్రం 6గంటలకు మంగళ శాసనం, యజమాన అనుజ్ఞ, నిత్యహోమం, పుణ్యాహవచనం, పూర్ణాహుతి, అంకురార్పణం, యాగపూజలను చిన్న జీయర్‌స్వామి శాస్త్రోత్తంగా ప్రారంభించారు. శ్రీసిటీ సంస్థ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్, ఆలయ తిరుప్పణి కమిటీ ఛైర్మన్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఆలయ ధర్మకర్త వి.వసంత్‌కుమార్, దేవస్థానం నిర్వాహణ కమిటీ కార్యదర్శి పి.రవీంద్రకుమార్‌రెడ్డి తదితరులు చిన్నజీయర్‌స్వామిని ఘనంగా స్వాగతించి ఆలయ మర్యాదలతో సత్కరించి, ఆయన మంగళా శాసనాలు, ఆశీస్సులందుకున్నారు. ఈ సందర్భంగా స్వామిజీ ఆలయ జీర్ణోద్ధారణ పనులను విజయవంతంగా పూర్తిచేసి, మహాకుంభాభిషేకం నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు సిద్ధం చేసిన దేవస్థానం నిర్వాహక కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తూ.. 1996లో ఈ ఆలయంలో నిర్వహించిన మహాకుంభాభిషేకంలో పాల్గొన్న తాను ప్రస్తుతం తృతీయ మహాకుంభాభిషేక పూజలను ప్రారంభించడం భగవంతుడి దయగా అభివర్ణించారు. పలు దివ్యదేశాలకు చెందిన అర్చక స్వాములు 50మంది ఆధ్వర్యంలో శ్రీనివాస పెరుమాళ్ ఆలయ నిర్వాహకులు ఈ మహాకార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ప్రసంశనీయమన్నారు. ఇలాంటి పుణ్య కార్యక్రమాలకు, ఆలయాలకు కైంకర్యాలు సమర్పించడం ద్వారా భగవంతుడి కటాక్షం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గోపురం కుంకుమ తయారీ సంస్థ అధినేత వైవీ హరికృష్ణ, చెన్నై టీటీడీ సలహా మండలి మాజీ అధ్యక్షులు కె.ఆనంద్‌కుమార్‌రెడ్డి, ఎస్.రవిచంద్రన్, శ్రీ వెంకటాద్రి భజన సమాజం నిర్వాహకుడు కిషోర్, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్) చెన్నై విభాగం నిర్వాహకులు సహా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కళానృత్య ఆర్ట్స్ అకాడమీ చెందిన కళాకారిణిలు నృత్యప్రదర్శనతో అలరించారు.

కోవిల్‌పట్టిలో 45 సవర్ల బంగారం చోరీ

రూ.26 లక్షల నగదు కూడా ● చెన్నై ముఠా అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టిలో గత నెలలో జరిగిన భారీ చోరీ కేసులోని మిస్టరీని స్థానిక పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి స్థానిక పులియంతోపునకు చెందిన ముఠాను అరెస్టు చేశారు. గత నెల 9వ తేదీన కోవిల్‌పట్టి సాలిహాపురానికి చెందిన మాంసం దుకాణ యజమాని సులేమాన్ ఇంట్లో రూ.45 సవర్ల బంగారం, రూ.26 లక్షల నగదు చోరీ జరిగింది. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు స్థానిక కోవిల్‌పట్టి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో చెన్నై, పులియంతోపు శివరాజపురానికి చెందిన శరత్‌కుమార్, అక్బర్ అలీ, రాజపాళెయానికి చెందిన గణేష్‌రాజ్, శక్తిగణేష్‌కు సంబంధం ఉన్నట్టు గుర్తించి వారిని అరెస్టు చేశారు. వారిని విచారించగా వీరంతా అనేక కేసుల్లో నిందితులుగా ఉన్నట్టు తేలింది. వీరంతా రాజపాళెయంలో నివసిస్తూ ఇలా చోరీలకు పాల్పడుతున్నట్టు వెల్లడించారు. అరెస్టు చేసిన వారిలో శక్తి గణేష్ కొన్ని రోజుల క్రితం ఉపాధి కోసం కోవిల్‌పట్టికి వెళ్ళి అక్కడే ఉంటూ చోరీలు చేసేందుకు మిగిలిన వారిని చేరదీశాడు. వీరంతా కలిసి కోవిల్‌పట్టితో పాటు పలు ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్నారని తేలింది. చోరీ చేసిన డబ్బులతో జల్సా జీవితాన్ని అనుభవిస్తూ వచ్చారు.

ఖైదీలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు: హైకోర్టు

ప్యారీస్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఖైదీలతో పనులు చేయిస్తే చర్యలుంటాయని జైళ్ల శాఖకు మద్రాస్ హైకోర్టు హెచ్చరికలు జారీ చేసింది. క్రిమినల్ కేసులో పట్టుబడి పుళల్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న కోదండన్ తనకు 30 రోజులు సెలవు కావాలని కోరుతూ జైలు అధికారి వద్ద వినతిపత్రం సమర్పించారు. అయితే మూడేళ్ల శిక్ష పూర్తైతే సెలవుకు అర్హతంటూ అధికారులు తోసిపుచ్చారు. దీనిపై మద్రాస్ హైకోర్టులో కోదండన్ తరుపున దాఖలైన పిటిషన్ న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, ఎం.జ్యోతిరామన్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. కోదండన్ జైలులో సత్ప్రవర్తనతో వ్యవహరించడమేకాకుండా పరిపాలనా పనులు కూడా చేస్తున్నాడని న్యాయవాది అక్షయ తన వాదన వినిపించారు. వేతనం తీసుకుంటున్న జైలు అధికారులు ఖైదీలతో పరిపాలనా పనులు చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భవిషత్తులో ఇలాంటి ఆరోపణలు తమ దృష్టి వచ్చినట్లైతే సంబంధిత జైలు అధికారులపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించిన న్యాయమూర్తులు పిటిషనర్ కోదండన్‌కు 23రోజల సెలవు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

డీఎంకే నేతల ఆధ్వర్యంలో జిమ్ ప్రారంభం

తిరుత్తణి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని అరుంగుళంలో డీఎంకే పశ్చిమ విభాగం కార్యదర్శి కులూర్ ఎం.రాజేంద్రన్, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆర్గనైజర్ కరాటే బాలు ఆధ్వర్యంలో కేకేబీ ఫిట్‌నెస్ సెంటర్‌ను ఈ శనివారం ఉదయం ఘనంగా ప్రారంభించారు. దీనికి తిరువళ్లూరు ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ ముఖ్య అతిథిగా విచ్చేసి, ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజు వ్యాయామం అవసరమని, ప్రతి ఒక్కరు ఉదయాన్నే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంకే నాయకులు పాల్గొన్నారు.



జిమ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్

మహిళలను వేధించిన కేసులో నలుగురి అరెస్ట్

● మరో ముగ్గురి కోసం గాలింపు

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈసీఆర్ రోడ్డులో పార్టీ జెండా కట్టిన కారులో వచ్చి మహిళలను వేధించిన వ్యవహారంలో మరో సూత్రధారిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఘటన జరిగిన రోజు అర్ధరాత్రి నడిరోడ్డుపై కారు నిలిపిన యువకులు, ఆ మార్గంలో మరో కారులో వచ్చిన మహిళలను వేధించిన వ్యవహారం సంచలనం రేపింది. మహిళలను యువకులు వేధించే దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. బాధిత మహిళల ఫిర్యాదుతో 4సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు, పరారైన యువకులను అరెస్ట్ చేసేందుకు ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశారు. ఈ ఘటనలో యువకులు వినియోగించిన రెండు కార్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు, శుక్రవారం చంద్రు అనే కళాశాల విద్యార్థిని అరెస్ట్‌చేసి, రహస్య ప్రదేశంలో ఉంచి పలువిడతలుగా విచారించారు. అతను అందించిన సమాచారంతో ఈ కేసులో మొత్తం ఏడుగురు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు, మరో ముగ్గురిని అరెస్ట్ చేసి, మిగిలిన ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

ఉద్యోగాల పేరిట రూ.2 కోట్లు మోసం

నిందితుడి అరెస్ట్

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురు నుంచి సుమారు రూ.2 కోట్ల మోసానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగరానికి చెందిన పద్మనాభన్‌కు పరిచయమైన సాయిపుతిన్ (51) పోలాండ్‌లో ఉద్యోగం ఉందని, నెలకు రూ.లక్ష వేతనం అందిస్తారని చెప్పాడు. ఆ మాటలు నమ్మిన పద్మనాభన్ అతనికి రూ.1.25 లక్షలు ఇచ్చాడు. రోజులు గడిచినా సాయిపుతిన్ నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో డబ్బులు తిరిగి చెల్లించాలని కోరాడు. అందుకు సాయిపుతిన్ నగదు అందించకపోగా బెదిరించినట్లు సమాచారం. పద్మనాభన్ ఫిర్యాదుపై కేంద్ర క్రైం విభాగం పోలీసులు సాయిపుతిన్‌ను అరెస్ట్ చేశారు. సాయిపుతిన్ ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురిని నమ్మించి సుమారు రూ.2 కోట్ల వరకు మోసానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తెలిసింది. సాయిపుతిన్‌ను కోర్టులో హాజరుపరచిన పోలీసులు, న్యాయమూర్తి ఉత్తర్వులతో జైలుకు తరలించారు.

కాడువెట్టి గురుకు ఘననివాళి



పెరంబూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలందూర్ పీఎంకే శాఖ ఆధ్వర్యంలో దివంగత వన్నియర్ సంఘ అధ్యక్షుడు జె.గురు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ పర్యవేక్షణలో వన్నియర్ సంఘం అధ్యక్షుడిగా వ్యవహరించిన కాడువెట్టి గురు అనారోగ్యం కారణంగా మృతిచెందారు. ఆయన జయంతి సందర్భంగా పీఎంకే, వన్నియర్ సంఘం ఆధ్వర్యంలో పేదలకు సహాయాలు పంపిణీ చేశారు. మురుగన్, పసుమై తాయగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కన్నన్ సహా పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్తీసారా కేసు...

చెంగల్పట్టు కోర్టుకు బదిలీ చేయాలన్న సీబీఐ

ప్యారీస్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి ప్రాంతంలో 68మంది ప్రాణాలు తీసిన కల్తీ సారా కేసును చెంగల్పట్టు కోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ, కళ్లకుర్చి కోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. కళ్లకుర్చి కరుణాపురం, శేషసముద్రం, మాధవచ్చేరి ప్రాంతాల్లో గత ఏడాది జూన్ 19న కల్తీసారా తాగి 229మంది అనారోగ్యం పాలవగా, వీరిలో చికిత్సలు ఫలించిక 68 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనకు సంబంధించి విల్లుపురం సీబీసీఐడీ పోలీసులు కేసు నమోదు చేసి, కరుణాపురానికి చెందిన గోవిందరాజ్, విజయ, దామోదరం సహా 24 మందిని అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు కడలూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసు విచారణ కళ్లకుర్చి ప్రిన్సిపల్ సెషన్స్‌కోర్టులో కొనసాగుతున్న నేపథ్యంలో ఈ కేసులో సంబంధాలున్న ముగ్గురికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ఇదిలా ఉండగా, కల్తీసారా కేసు సీబీఐకు బదిలీ కావడంతో కేసుకు సంబంధించిన అన్ని దస్తావేజులు, ఆధారాలను సీబీసీఐడీ పోలీసులు సీబీఐ పోలీసులకు అప్పగించారు. ఆ తర్వాత గత నెల 28న సీబీఐ అధికారులు కరుణాపురం, మాధవచ్చేరి, శేషసముద్రం ప్రాంతాల్లో సారా విక్రయించిన స్థలాలకు నేరుగా వెళ్లి పరిశీలించారు. ఈ నేపథ్యంలో కళ్లకుర్చి కోర్టులో కొనసాగుతున్న కల్తీసారా కేసును చెంగల్పట్టు ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో బదిలీ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. త్వరలోనే ఈ కేసు కళ్లకుర్చి నుంచి చెంగల్పట్టు కోర్టుకు బదిలీ అయ్యే అవకాశముంది. ఇదిలా ఉండగా కల్తీసారా కేసులో పట్టుబడి కడలూరు సెంట్రల్ జైలులో ఉన్న ఖైదీలు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కళ్లకుర్చి న్యాయస్థానం తోసిపుచ్చింది.

మహిళపై దాడి: దంపతుల అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కంలో లీజుకు తీసుకున్న ఇల్లు ఖాళీ చేయాలని నిర్బంధించి మహిళపై దాడికి పాల్పడిన దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. నుంగంబాక్కం పశ్చిమ మాడవీధిలో ఉన్న ఓ ఇంటిని 2013వ సంవత్సరంలోరూ.15లక్షలకు నిరోషా లీజుకు తీసుకుంది. ఆ ఇంటి యజమానురాలు యశోద వ్యాపారం నిమిత్తం 2014వ సంవత్సరం నుంచి పలు విడతగా మొత్తం రూ.23.5 లక్షలను నిరోషా దగ్గర తీసుకుంది. 2017లో యశోద కుమార్తెకు వివాహం సందర్భంగా నిరోషా తన 13సవర్ల నగలపై ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఇటీవల యశోద కుటుంబీకులు నిరోషాను ఇల్లు ఖాళీ చేయాలని కోరారు. తాను రుణంగా ఇచ్చిన నగలు, నగదు తిరిగివ్వాలని కోరడంతో గతనెల 30వ తేదీ మధ్యాహ్నం యశోద కుమారుడు కుమార్ (52), కోడలు లత (47), మరికొంతమంది వ్యక్తులు నిరోషాపై దాడి చేశారు. ఇంట్లో ఉన్న వస్తువులను బయటపడేసి తాళం వేశారు. దీనిపై నిరోషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దాడికి పాల్పడిన వ్యక్తులను శనివారం ఉదయం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆ సూట్‌కేస్‌లో రూ.10 లక్షల విలువైన బంగారం, వజ్రాలు

పెరంబూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుడు సూట్‌కేస్ మార్చి తీసుకెళ్లిన వ్యవహారంలో, రైల్వే పోలీసులు సత్వరం స్పందించడంతో రూ.10 లక్షల విలువైన బంగారం, వజ్రాలు యజమానికి దక్కాయి. చెన్నై నుంచి తిరుచ్చికి గత నెల 29వ తేది పల్లవన్ ఎక్స్‌ప్రెస్‌లో మాజీ బ్యాంక్ అధికారి కాశినాథన్ ప్రయాణించారు. ఆయన తిరుచ్చి రైల్వేస్టేషన్‌లో దిగే సమయంలో, తన సూట్‌కేసును ఎవరో మార్చి తీసుకెళ్లినట్లు గుర్తించి, తిరుచ్చి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు, కాశినాథన్ వచ్చిన రైలు బోగీలో ప్రయాణించిన వారి వివరాలు సేకరించి, ఒక్కో వ్యక్తిని సంప్రదించి విచారించారు. వారిలో శ్రీరంగానికి చెందిన మాజీ ప్రభుత్వ అధికారి రాజగోపాల్ సూట్‌కేస్ మార్చి తీసుకెళ్లినట్లు తెలిసింది. రాజగోపాల్‌ను నేరుగా రప్పించిన పోలీసులు, రెండు సూట్‌కేసులు తెరచి, ఎవరివి వారికి అప్పగించారు. రాజగోపాల్ వదలి వెళ్లిన సూట్‌కేసులో రూ.10 లక్షల విలువైన బంగారం, వజ్రాలు, పట్టు చీరలున్నారు. నిజాయితీగా సూట్‌కేస్ అప్పగించిన కాశినాథన్‌ను రైల్వే పోలీసులుఅభినందించారు.

కుమార్తెపై అత్యాచారం

పోక్సో కింద కామాంధ తండ్రి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కుమార్తెపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు. పుదుకోట జిల్లాకు చెందిన కార్మికుడు తన 16 ఏళ్ల కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న జిల్లా చిన్నపిల్లల భద్రత అధికారులు బాధిత బాలికను విచారించారు. మూడేళ్లుగా తండ్రి తనపై లైంగిక వేధింపులకు పాల్పడేవాడని, కొద్ది నెలలుగా మూడు సార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని తెలిపింది. ఈ వ్యవహారంపై అధికారుల ఫిర్యాదుతో ఇలుప్పూర్ మహిళా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి, కామాంధ తండ్రిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

లైంగిక వేధింపుల కేసులో యువకుడికి జైలు

పెరంబూర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక పులియాంతోపు పోలీసు జిల్లా పరిధిలో ఏడేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడికి కోర్టు ఐదేళ్ల జైలుశిక్ష విధించింది. 2020లో ఓ అగంతకుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాధిత బాలిక తండ్రి ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు, 24 ఏళ్ల యువకుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసు స్థానిక మద్రాసు హైకోర్టు ప్రాంగణంలోని పోక్సో కోర్టులో విచారణ జరిగింది. నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.5,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

టోల్‌గేట్ సమీపంలోని హోటళ్ల తనిఖీ

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విక్రవాండి టోల్‌గేట్ సమీపంలోని హోటళ్లలో ఆహార భద్రత శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. విల్లుపురం జిల్లాలోని జాతీయ రహదారుల వెంబడి ఉన్న హోటళ్లలో పదార్థాలు నాసిరకంగా ఉంటున్నాయని, ధరలు కూడా అధికంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఉత్తర్వులతో ఆహార భద్రత శాఖ అధికారి సుగంధన్ నేతృత్వంలో సిబ్బంది విక్రవాండి టోల్‌గేట్ సమీపంలోని హోటళ్లు, దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో తినేందుకు పనికిరాని 7 కిలోల పదార్థాలు, 5 కిలోల చెడిపోయిన మాంసం, 20 లీటర్ల శీతల పానీయాలు, నిషేధిత ప్లాస్టిక్ బ్యాగులు స్వాధీనం చేసుకున్నారు. నాలుగు దుకాణాలకు జరిమానా విధించిన అధికారులు, మరో ఐదు దుకాణాల యజమానులను హెచ్చరించారు.



స్వాతంత్ర్య సమరయోధుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఓమందూర్ రామస్వామి రెడ్డి 103వ జయంతిని పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో శనివారం నివాళులర్పిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి



రామకృష్ణకు అనిల్‌కుమార్‌రెడ్డి బృందం నివాళి

రామకృష్ణకు ఘన నివాళి

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక మందిరం కమిటీ మాజీ కార్యదర్శి యర్రమిల్లి రామకృష్ణ తొలి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కమిటీ ఘన నివాళులర్పించింది. స్థానిక మైలాపూర్‌లోని అమరజీవి స్మారక మందిరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కమిటీ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి, సభ్యులు నారాయణ గుప్తా, గుడిమెట్ల చెన్నయ్య, డాక్టర్ ఏవీ శివకుమారి, సిబ్బంది జల్లుకుమార్, నాగమణి తదితరులు రామకృష్ణ చిత్రపటానికి పుష్పమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్మారకమందిరం కోసం రామకృష్ణ చేసిన సేవల్ని స్మరించుకున్నారు.

మిస్టర్ టూరిజం వరల్డ్ పోటీలకు లోగానంద్ కుమార్

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): 'మిస్టర్ టూరిజం వరల్డ్' పోటీలకు చెన్నైకి చెందిన లోగానంద్ కుమార్ ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు వియత్నాంలో జరగనున్నాయి. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు వియత్నాంకు వెళ్లనున్నారు. ఈ అంతర్జాతీయ ఫ్యాషన్, టూరిజం ఫెస్టివల్‌లో వైవిధ్యాన్ని ప్రోత్సహించేలా పోటీలు జరుగనున్నాయి. ఉత్తమ పని తీరు, ప్రతిభ ఆధారంగా విజేతను ఎంపిక చేస్తారు. ఈ పోటీలకు భారత్ తరపున చెన్నైకి చెందిన లోగానంద్ కుమార్ ప్రాతినిధ్యం వహించనున్నారు. దేశంలోని ప్రముఖ ఫ్యాషన్ కన్సల్టెంట్, కొరియోగ్రాఫర్లలో ఒకరైన కరుణ్ రామన్ లోగానంద్ కుమార్ ప్రదర్శనను మెరుగుపరిచే బాధ్యతలు తీసుకుంటారు. డాపర్ అండ్ డేర్ బ్రాండ్ వ్యవస్థాపకుడు, ఏజ్ డిజైనర్ విశాల్ ధవానీ లోగానంద్ ప్రదర్శన కోసం ప్రత్యేక డిజైన్‌తో దుస్తులు రూపొందించనున్నారు.



లోగానంద్ కుమార్‌ను అభినందిస్తున్న కరుణ్ రామన్ తదితరులు

గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఆధ్వర్యంలో జంతువుల జనన నియంత్రణ పథకాలను అమలు చేసి వీధి కుక్కల బెడద నుంచి నగరవాసులను కాపాడటంతో పాటు, ఇళ్ళల్లో పెంచుకుంటున్న పెంపుడు శునకాలను సంరక్షించే పథకాలను విస్తృతంగా చేపడుతున్నారు. సింగార చెన్నై 2.0 పథకం అమలులో భాగంగా నగరంలో జంతువుల జనన నియంత్రణ (యానిమల్ బర్త్ కంట్రోల్-ఏబీసీ) కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా జంతువుల సంరక్షణ పథకాన్ని (చెన్నై కేర్ ఫర్ యానిమల్స్ ప్రాజెక్ట్ -సి-సీఏపీ)కూడా సమర్థవంతంగా అమలు చేస్తున్నారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి



అటు వీధి కుక్కలకు జనన నియంత్రణ
ఇటు పెంపుడు కుక్కలకు మేలైన సంరక్షణ

● జీసీసీలో శునక సమస్యలకు శాశ్వత పరిష్కారం

వీధి కుక్కల నుంచి...

చెన్నైలో విచ్చలవిడిగా తిరుగుతూ నగరవాసులను బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కల బారి నుండి కాపాడేందుకు ఏబీసీ సెంటర్ల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. ఆ మేరకు పుళియంతోపు, రాయపేట లాయిడ్స్‌రోడ్డు, కన్నమ్మాపేట, మీనంబాక్కం, షోళింగనల్లూరులో ఏబీసీ సెంటర్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.19.72 కోట్లతో ఈ సెంటర్లను నిర్మిస్తున్నారు. ప్రతి సెంటర్ 4,400 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగి ఉంటుంది. 40 శునకాలను ఉంచడానికి బోన్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. మొదటి అంతస్తులో జనన నిరోధక శస్త్రచికిత్సలు చేసుకున్న శునకాల కోసం 100 స్టీలు ఊచలతో కూడిన 100 బోన్లుంటాయి. శునకాలకు రక్తపరీక్షలు జరిపేందుకు అనువైన పరికరాలు, అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరికరం కూడా ఉన్నాయి.



ఆహారం తింటున్న శునకం





శునకానికి సంబంధించిన కేసుషీట్‌పై వివరాలు రాస్తున్న సిబ్బంది - స్టీలు బోనుల్లో శునకాలు - బుల్లి కుక్కను చికిత్స కోసం తీసుకొచ్చిన బాలిక

ఏడాదికి 27 వేల ఆపరేషన్లు...



ఆపరేషన్ థియేటర్

శునకాలకు ఏయే ప్రాంతాల నుంచి తీసుకొచ్చిందని, వాటికి ఏ తేదీల్లో జనన నిరోధక శస్త్రచికిత్స చేసిందీ తదితర వివరాలన్నీ క్యూఆర్‌కోడ్‌ను, మైక్రోచిప్పింగ్ టెక్నాలజీని వెటర్నరీ డాక్టర్లు ఉపయోగిస్తున్నారు. ప్రతి సెంటర్‌లో రోజుకు కనీసం 30 శునకాలకు జనన నిరోధక శస్త్రచికిత్సలు యేడాదికి 27వేల ఆపరేషన్లు జరపాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు. వీటన్నింటితోపాటు కన్నమ్మాపేట సెంటర్ సమీపంలో శునకాల కోసం ప్రత్యేక శ్మశానవాటికను కూడా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఏర్పాటు చేసింది.



నగరంలోని శునకాల జనన నియంత్రణ కేంద్రం

పెంపుడు శునకాల కోసం...

ఇక ఇళ్లలో పెంచుకుంటున్న, రోగాలబారిన పడిన శునకాలకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడుపుతున్న చెన్నై- కేర్ ఫార్ యానిమల్స్ ప్రాజెక్టు సెంటర్లలో వైద్యపరీక్షలు జరిపి తగు చికిత్సలందిస్తున్నారు. నగర వాసులు ప్రత్యేకించి చిన్నారులు తాము అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న శునకాలను తీసుకువచ్చినప్పుడు వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తున్నారు. ఈ కేర్ సెంటర్ లోపలి గదుల గోడలపై రంగురంగుల పెయింటింగ్‌తో పక్షుల బొమ్మలు, శునకాల బొమ్మలు, కార్టూన్లూ కనువిందు చేస్తాయి. చికిత్స కోసం వచ్చే ప్రతి శునకాన్ని కేర్ సెంటర్ సిబ్బంది చేతులకు గ్లోవ్స్ వేసుకుని పరీక్షా బల్లలపై తీసుకెళతారు. వెటర్నరీ డాక్టర్లు వాటిని పరీక్షించి సూదిమందులు వేస్తారు. ఇదే తరహాలో జనన నిరోధక కేంద్రాల్లో వీధి కుక్కలకు సైతం మెరుగైన వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారు. ఆపరేషన్ థియేటర్లు అంతర్జాతీయ స్థాయి సాంకేతిక పరికరాలను కలిగి ఉన్నాయి. సింగారచెన్నై 2.0 ప్రాజెక్టులో భాగంగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు నగరంలో వీధి కుక్కల సంఖ్యను నియంత్రించేందుకు ఈ ఏబీసీ సెంటర్ల ద్వారా చర్యలు తీసుకుంటూనే నగరవాసుల పెంపుడు జంతువుల సంరక్షణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారనడం అతిశయోక్తి కాదు.



శునకాన్ని శస్త్రచికిత్స సిద్ధం చేస్తున్న వైద్య సిబ్బంది

జీవితంలో డబ్బే ముఖ్యం కాదు

● నటి శాన్వి మేఘన

జీవితంలో డబ్బు ముఖ్యం కాదని తనకు సినిమా మంచి విషయాన్ని తెలియజేసిందని హీరోయిన్ శాన్వి మేఘన అన్నారు. మణికంఠన్ హీరోగా, రాజేశ్వర్ కాళిస్వామి దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'కుడుంబస్తన్'. సినిమాక్కారన్ ఎస్.వినోద్ కుమార్ నిర్మాత. గత నెల 24న విడుదలైన చిత్రం ఘన విజయం సాధించింది. శాన్వి మేఘన హీరోయిన్. ఈ సినిమా సక్సెస్ వేడుకలను తాజాగా చెన్నైలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాన్వి మాట్లాడుతూ... 'తమిళంలో నేను నటించిన తొలి చిత్రమే విజయం సాధించడం సంతోషంగా ఉంది. అందరి హీరోలతో కలిసి పనిచేయాలని ఉంది. త్వరలోనే తెలుగులో కూడా సినిమాను విడుదల చేస్తారని భావిస్తున్నా.ఈ సినిమాలో నేను పోషించిన పాత్ర లాంటి భార్య కావాలని చాలామంది అన్నారు. జీవితంలో డబ్బు ముఖ్యం కాదని ఈ సినిమా నేర్పింది' అన్నారు. హీరో మణికంఠన్ మాట్లాడుతూ... 'మూవీపై ప్రకటన చేసిన కొద్దిసేపటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా విడుదలైన తర్వాత కూడా ప్రేక్షకుల నుంచి ఆదరణ లభించింది. ఈ సినిమా కోసం ప్రతి నటుడు, టెక్నీషియన్ ఎంతో శ్రమించారు. వారందరికీ ధన్యవాదాలు' అన్నారు. చిత్ర దర్శకుడు రాజేశ్వర్ కాళిస్వామి మాట్లాడుతూ... 'ఈ సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు, మా తొలి చిత్రాన్ని ఇంత ఘన విజయం చేసిన మీడియాకు ధన్యవాదాలు' అన్నారు.



'కుడుంబస్తన్' సక్సెస్ మీట్‌లో మణికంఠన్, శాన్వి

తమిళ చిత్రజ్యోతి

ఫెఫ్సీకి పోటీగా మరో కార్మిక సంఘం!

తమిళ చిత్రపరిశ్రమలో మరో సినీ నిర్మాణ కార్మికుల సంఘం పురుడు పోసుకోనుంది. ప్రస్తుతం 23 సంఘాలతో కూడిన దక్షిణ భారత సినీ నిర్మాణ కార్మికుల సమ్మేళనం ఫెఫ్సీకి తమిళనాడు సినీ నిర్మాతల మండలికి మధ్య విభేదాలు తార స్థాయికి చేరుకున్నాయి. దీంతో గతంలో ఈ రెండు సంఘాల మధ్య అవగాహన ఒప్పందాన్ని రద్దు చేసినట్టు 2024 డిసెంబరు 20వ తేదీన ఫెఫ్సీ అధికారికంగా వెల్లడించింది. అలాగే, గత నెల 27న కూడా ఒప్పంద రద్దు అయినట్టు మరోమారు ప్రకటించింది. ఇది నిర్మాతల మండలికి ఆగ్రహం తెప్పించింది. ఇక నుంచి తమకు అనుకూలంగా ఉండే సినీ నిర్మాణ కార్మికులను ఉపయోగించుకుని సినిమాలు తీసుకోవచ్చని నిర్మాతల మండలి ప్రకటించింది. ఇందుకోసం "తమిళనాడు సినీ నిర్మాణ కార్మికుల సమ్మేళనం" పేరుతో కొత్తగా ఒక సంఘాన్ని స్థాపించనున్నట్టు ప్రకటించింది. దీనికి సంబధించిన అధికారిక ప్రకటన పత్రికల్లో విడుదల చేస్తామని, ఈ సంఘంలో చేర దలచిన కార్మికులు ప్రకటనలో పేర్కొనే చిరునామాలో సంప్రదించాలని నిర్మాతల మండలి కోరింది. ఈ ప్రకటనను అనేక మంది నిర్మాతలు స్వాగతించారు. అయితే, ఫెఫ్సీ పెద్దలు మాత్రం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.



ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్‌కె సెల్వమణి

బాలీవుడ్‌లో కోలీవుడ్ దర్శకులకు అవకాశం

ఇటీవల కోలీవుడ్ దర్శకులకు బాలీవుడ్‌లో అవకాశాలు క్రమంగా పెరుగుతున్నాయి. గతంలో తమిళ చిత్రపరిశ్రమకు చెందిన దర్శకుడు భీమ్‌సింగ్, కె.బాల చందర్, భారతీరాజా, మణిరత్నం, అట్లీ వంటివారు హిందీ చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఇపుడు యంగ్ జనరేషన్ దర్శకులకు కూడా హిందీ నిర్మాతలు అవకాశాలు ఇస్తున్నారు. షారూక్ ఖాన్ హీరోగా అట్లీ 'జవాన్' చిత్రాన్ని తెరకెక్కించి, కలెక్షన్లపరంగా సరికొత్త రికార్డులు నెలకొల్పారు. అలాగే, బాలీవుడ్ అగ్రహీరోలు అమీర్‌ఖాన్, అక్షయ్ కుమార్ హీరోలను కోలీవుడ్ దర్శకుడు ఏ.ఆర్.మురుగదాస్ డైరెక్ట్ చేశారు.ఇపుడు సల్మాన్‌ఖాన్ హీరోగా 'సికిందర్' పేరుతో ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో రష్మిక మందన్నా హీరోయిన్. అలాగే, రజనీకాంత్‌తో 'కూలీ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న లోకేష్ కనకరాజ్.. తన తదరుపరి చిత్రాన్ని అమీర్‌ఖాన్‌తో తీయబోతున్నారనే ప్రచారం సాగుతుంది. అయితే, తమిళంలో ఇప్పటికే ఈయన కమిట్ అయిన చిత్రాలను పూర్తి చేసిన తర్వాతే బాలీవుడ్ ప్రాజెక్టుపై దృష్టిసారించే అవకాశం ఉంది. అదేవిధంగా 'రాకీ', 'సానికాయితం', 'కెప్టెన్ మిల్లర్' వంటి చిత్రాలను రూపొందించిన అరుణ్ మాధేశ్వరన్ ప్రస్తుతం ధనుష్ హీరోగా సంగీత దర్శకుడు ఇళయరాజా బయోపిక్‌ను తెరకెక్కిస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత హిందీ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. 'అమరన్' ఫేం రాజ్‌కుమార్ పెరియసామి, 'షేర్‌షా' ఫేం విష్ణువర్ధన్ కూడా బాలీవుడ్‌లో ప్రాజెక్టులు చేపట్టనున్నారు. ఒక్క తమిళ దర్శకులకే కాకుండా, దక్షిణాదిలోని ఇతర భాషలకు చెందిన దర్శకులకు కూడా బాలీవుడ్‌లో అవకాశాలు వస్తుండటం గమనార్హం.



రాజ్‌కుమార్, అరుణ్, లోకేష్ కనకరాజ్

అజిత్ 'విడాముయర్చి'కి యూ/ఏ సర్టిఫికెట్

హీరో అజిత్ కుమార్ - దర్శకుడు మగిళ్ తిరుమేని కాంబినేషన్‌లో రూపొందిన 'విడాముయర్చి' చిత్రానికి సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్‌ను మంజూరు చేసింది. ఈ నెల 6న విడుదలకు సిద్ధమైన ఈ చిత్రంలో త్రిష, సీనియర్ హీరో అర్జున్, రెజీనా కెసాంద్రా, ఆరవ్, నిఖిల్ నాయర్ తదితరులు నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ సినిమాను చూసిన సెన్సార్ బోర్డు సభ్యులు యూ/ఏ సర్టిఫికెట్‌ను మంజూరు చేశారు. ఈ విషయాన్ని నిర్మాతలు అధికారికంగా వెల్లడించారు.





పురస్కారం అందుకుంటున్న పుష్పలత, కళాధినాథన్ తదితరులు

'అంబికా ఎంపైర్' హోటల్‌కు రెండు పురస్కారాలు

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వందడుగుల రోడ్డులో వున్న అంబికా ఎంపైర్ హోటల్ రెండు ప్రతిష్ఠాత్మక అవార్డులు గెలుచుకుంది. 'లగ్జరీ బిజినెస్ హోటల్ ఆఫ్ ది ఇయర్ -2024' అవార్డుతో పాటు హాస్పిటాలిటీ విభాగంలో ఉత్తమ జనరల్ మేనేజర్ అవార్డు కూడా గెలుచుకుంది. ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ తమిళనాడు పవర్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంజీవ్ సేథ్, ఇందిరా గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్స్ చీఫ్ కార్పొరేట్ రిలేషన్స్ రాజీథామస్ చేతుల మీదుగా ఈ పురస్కారాలను ఇటీవల జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అంబికా ఎంపైర్ హోటల్ జనరల్ మేనేజర్ కళాధినాథన్ అందుకున్నారు. అదేవిధంగా అడ్మిన్ విభాగ మేనేజర్ ఆర్‌కే పుష్పలత కూడా అవార్డును అందుకున్నారు.

విద్య, వ్యవసాయ రంగాల్లో వృద్ధికి బడ్జెట్ ప్రోత్సాహం: సీఐఐ

చెన్నై, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో శనివారం కేంద్ర విత్తమంత్రి నిర్మలా సీతారామన్ దాఖలు చేసిన బడ్జెట్ మధ్య, చిన్నతరహా పరిశ్రమలు,వ్యవసాయం, విద్య, ఉత్పాదక రంగాలను ప్రోత్సహించేలా ఉందని, ఇది తమిళనాడు, దక్షిణ ప్రాంతంపై గణనీయమైన ప్రభావం చూపుతుందని సీఐఐ ప్రతినిదులు అభిప్రాయపడ్డారు. శనివారం చెన్నైలో సీఐఐ సదరన్ రీజియన్ చైర్‌పర్సన్, చంద్రా టెక్స్‌టైల్స్ లిమిటెడ్ చైర్మన్ డాక్టర్ ఆర్.నందిని, సీఐఐ తమిళనాడు స్టేట్ కౌన్సిల్, వీల్స్ ఇండియా చైర్మన్ శ్రీవత్స్ రాం, సీఐఐ వైస్ చైర్మన్, గ్లాస్ అండ్ గ్లాస్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఏఆర్ ఉన్నికృష్ణన్, సీఐఐ సదరన్ రీజియన్ రీజనల్ డైరెక్టర్ ఎస్ఎంపీ జయేష్ తదితరులు కేంద్రబడ్జెట్‌ను విశ్లేషించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్య, చిన్నతరహా పరిశ్రమలకు సాధికారత కల్పించడం,రుణ సదుపాయాలను పెంపొందించడం, సమ్మిళిత వృద్ధిని ప్రోత్సహించడం ద్వారా స్థితిస్థాపక పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను రూపొందించడంపై బడ్జెట్ దృష్టి పెడుతుందన్నారు. తమిళనాడు బలమైన ఆటో, ఆటో-అనుబంధ రంగాన్ని దృష్టిలో వుంచుకుని, ఈవీ ఉత్పత్తి, మొబైల్ ఫోన్ బ్యాటరీల తయారీని పెంచడానికి ప్రభుత్వ చొరవలు ఈ ప్రాంతంలో గణనీయమైన ఉద్యోగ కల్పన, తయారీ వృద్ధిని పెంచుతాయన్నారు. తమిళనాడు కొత్త పెట్టుబడులు, పాదరక్షలు, తోలు పరిశ్రమ నుంచి అదనపు ఎగుమతులతో లాభపడుతుందని భావిస్తున్నామని వివరించారు.



విలేఖరుల సమావేశంలో ఏఆర్ ఎన్నికృష్ణన్, శ్రీవత్స్ రాం, ఆర్.నందిని, జయేష్

ఉత్తర చెన్నై అభివృద్ధి పనులు వేగవంతం

● మంత్రి శేఖర్ బాబు ఆదేశం

అడయార్,ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై జిల్లాలో సాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు కోరారు. జిల్లాలో చేపట్టిన పనుల పురోగతిని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సైతం ఇప్పటికే రెండుసార్లు క్షేత్రస్థాయికి వెళ్ళి సమీక్షించారు. నార్త్ చెన్నై డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద మాధవరం అసెంబ్లీ సెగ్మెంట్‌లో పుళల్, మహాలక్ష్మి నగర్ కార్పొరేషన్ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.12 కోట్లతో చేపట్టిన పాఠశాల కొత్త భవనాల నిర్మాణం, పుళల్, ఇరట్టైమలై శ్రీనివాసపురం ప్రాంతంలో రూ.3 కోట్లతో నిర్మిస్తున్న ఫుట్‌బాల్ క్రీడా మైదానం, పెరంబూరు నియోజకవర్గంలో రూ.11.26 కోట్లతో సాగుతున్న వివిధ రకాలైన అభివృద్ధి పనులను మంత్రి స్వయంగా పరిశీలించారు.

సైకిల్ ర్యాలీ ప్రారంభం : యేటా సెప్టెంబరు 15న కలైంజర్ కరుణానిధి జయంతి వేడుకల్లో భాగంగా అన్నా సైకిల్ ర్యాలీ పోటీలను నిర్వహిస్తుంటారు. శనివారం స్వామి శివానంద సాలై దూరదర్శన్ కేంద్రం సమీపంలో ఈ సైకిల్ ర్యాలీ పోటీలను మంత్రి శేఖర్ బాబు ప్రారంభించారు. ఈ ర్యాలీ డీడీ కేంద్రం నుంచి ప్రారంభమై నేపియర్ వంతెన, ఐల్యాండ్ మైదానం, ఖాయిదే మిల్లత్ వంతెన, అన్నా సాలై, దుర్గా మిషన్ వరకు కొనసాగింది. ఈ పోటీలను 13 యేళ్ళలోపు, 15 నుంచి 17 యేళ్ళలోపు యువతీ యువకులకు నిర్వహించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన 2830 మందికి ప్రశంసా పత్రాలు, నగదు బహుమతిని ప్రదానం చేశారు.

గుండెపోటుతో సినీ నిర్మాత మృతి

డయార్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో 'ముల్లుం మలరుం', దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత నటించిన 'నదియై తేడి వంద కడల్', ఆర్‌వి ఉదయకుమార్ దర్శకత్వంలో విజయకాంత్ నటించిన 'చిన్నగౌండర్' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలను నిర్మించిన సీనియర్ సినీ నిర్మాత వి.నటరాజన్ (70) గుండెపోటుతో శనివారం స్థానిక మైలాపూర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వచ్చిన ఆయన ఇంటిపట్టునే ఉంటూ చికిత్స చేయించుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య జ్యోతి, కుమారులు సెంథిల్, విక్కి ఉన్నారు. ఆయన అంత్యక్రియలు మైలాపూర్ శ్మశానవాటికలో పూర్తి చేశారు. ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు.



వి.నటరాజన్ (ఫైల్)

డీఎంకేని విమర్శించే అర్హత ఏ పార్టీకీ లేదు

● దివ్య సత్యరాజ్

అడయార్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): డీఎంకేను విమర్శించే అర్హత రాష్ట్రంలోని ఏ ఒక్క రాజకీయ పార్టీకి లేదని సీనియర్ నటుడు సత్యరాజ్ కుమార్తె, డీఎంకే మహిళా నేత దివ్య సత్యరాజ్ అన్నారు. ఆమె శనివారం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ, అన్నా వర్సిటీ విద్యార్థిని అత్యాచార కేసులో ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారన్నారు. వీఐపీలు,సినీ ప్రముఖులతో ఎవరైనా ఫొటోలు తీసుకోవచ్చన్నారు. వాటి ఆధారంగా డీఎంకేకు సంబంధం ఉందని ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. విపక్షాలు చేసే విమర్శలు, ఆరోపణలకు తాము సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీకి ఈ విషయంపై మాట్లాడే అర్హత ఏమాత్రం లేదన్నారు.

సీయూబీ నికర ఆదాయంలో 14 శాతం వృద్ధి

అడయార్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పురాతన ప్రైవేట్ సెక్టార్ బ్యాంకుల్లో ఒకటిగా గుర్తింపు పొందిన సిటీ యూనియన్ బ్యాంకు (సీయూబీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడో త్రైమాసిక ఫలితాలను వెల్లడించింది. డిసెంబరు 31వ తేదీతో ముగిసిన థర్డ్ క్వార్టర్‌లో సీయూబీ ఆదాయంలో 12 శాతం వృద్ధి రేటు (రూ.1707 కోట్లు)ను సాధించినట్టు ఆ బ్యాంకు ఉన్నతాధికారులు శనివారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. రెండో త్రైమాసికంలో ఈ ఆదాయం రూ.1519 కోట్లుగా ఉండగా, ఇపుడది రూ.1707 కోట్లకు చేరుకుందని తెలిపింది. అలాగే, నెట్ ఇంటరెస్ట్ ఇన్‌కమ్ (నికర ఆదాయం)లో కూడా 14 శాతం వృద్ధితో రూ.588 కోట్లు సాధించగా, ఆపరేటింగ్ ప్రాఫిట్‌లో 20 శాతం వృద్ధితో రూ.436 కోట్లు, పన్ను చెల్లింపుల తర్వాత మొత్తం ఆదాయంలో 13 శాతం వృద్ధితో రూ.286 కోట్లు సాధించినట్టు వివరించింది. అలాగే, మొత్తం వ్యాపారం రూ.1,08,680 కోట్లుగా ఉండగా, డిపాజిట్ల రూపంలో రూ.58,271 కోట్లు, అడ్వాన్సుల రూపంలో రూ.50,409 కోట్ల వ్యాపారం జరిగినట్టు తెలిపింది. నాన్ ఇంటరెస్ట్ ఇన్‌కమ్‌గా రూ.228 కోట్లు రాగా, నిర్వహణ ఖర్చులు రూ.380 కోట్లకు పెరిగినట్టు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) నెట్ ఇంటరెస్ట్ మార్జిన్ 2024 మూడో త్రైమాసికంలో 3.50 శాతంగా ఉండగా ప్రస్తుతం 3.58 శాతానికి పెరిగినట్టు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఎన్.కామకోటి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



ఎన్.కామకోటి